క్లుప్తంగా

డీఎల్‌డీఓ సందర్శన



సీతంపేట: సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎల్‌డీఓ

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి, పులిపుట్టి గ్రామ సచివాలయాలను డీఎల్‌డీఓ గోపాలకృష్ణ మంగళవారం సందర్శించారు. సచివాలయ రికార్డులు, సిబ్బంది హాజరు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. దిశ యాప్‌పై మహిళలు, బాలికలకు అవగాహన కల్పించాలని మహిళా పోలీసులకు సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్లు డిస్‌ప్లే చేయాలన్నారు. ప్రజలకు సచివాలయాల ద్వారా మరింత మెరుగైన సేవలందించాలన్నారు.

అలమండలో ఎంపీడీఓ పరిశీలన

జియ్యమ్మవలస: అలమండ గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.రమేష్ సందర్శించారు. ఏపీ సేవలు, పీఎంజేఏవై సేవలపై డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎం వద్ద వివరాలు సేకరించారు. పని విషయంలో ఎటువంటి అలసత్వం వహించరాదని ఎంపీడీఓ సూచించారు.

ఏనుగుల సంచారంతో పంటలు ధ్వంసం



వరి నారును ధ్వంసం చేసిన ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం, బాసంగి, బాసంగిగదబువలసలో ఏనుగుల సంచారంతో పంటలు ధ్వంసమవుతున్నాయి. వెంకటరాజపురంలో మర్రాపు రామినాయుడు, ఎం.హరిపురానికి చెందిన కారాడ రాముకు చెందిన వరి ధాన్యం బస్తాలను చిందరవందర చేశాయి. పలువురు రైతుల రబీ వరి నారుమడులను నాశనం చేసి మంగళవారం గుమ్మిడిగెడ్డ వాగులోకి చేరుకున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల మళ్లింపు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వాటర్‌షెడ్ పథకంతో తాగునీటి సౌకర్యం మెరుగు



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

గుమ్మలక్ష్మీపురం: మైక్రో వాటర్ షెడ్ పథకం ద్వారా ప్రజలకు తాగు, సాగు నీటి సదుపాయం మెరుగుపడుతోందని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ జేకేపాడు గ్రామంలో మైక్రో వాటర్‌షెడ్ పథకం నిధులు రూ.1.40 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సర్పంచ్ చైతన్య ప్రవంతి, జెడ్పీటీసీ మండంగి రాధికతో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ కంపోనెంట్–ప్రధాన మంత్రి సించాయి యోజన 2.0 ద్వారా గుమ్మలక్ష్మీపురం మండలంలో 10 పంచాయతీల్లో నీటి సంరక్షణ పనులు చేపట్టడంతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పిస్తుండడం సంతోషదాయకమన్నారు. వాటర్‌షెడ్ పీఓ పోలినాయుడు, వార్డు సభ్యులు బిడ్డిక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దుర్గమ్మకు సంబర నీరాజనం



మేళతాళాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఘటాలు, ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. సంప్రదాయ వస్త్రాలంకరణలో నూతన దంపతులు ఘటాలతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు దారల్పాడి

ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు హర్షణీయం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిర్దేశించిన సబ్ ప్లాన్(ఉప ప్రణాళిక)ను ప్రభుత్వం మరో పదేళ్లు పొడిగించడం పట్ల జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. దళిత, గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం పదేళ్ల కాలపరిమితితో ప్రకటించిన గత ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం–2013 జనవరి 23 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈనెల 23తో కాలపరిమితి ముగియడంతో ఆయా వార్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మరో పదేళ్ల గడుపు పొడిగించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని దేవుకోన, కోమట్లపేట, బంగారమ్మపేట గ్రామాల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, ప్రజా సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గతంలో పింఛను కోసం పంచాయతీ కార్యాలయం వద్ద నిరీక్షించాల్సి వచ్చేదని, కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ నెల ఒకటో తేదీ తెల్లవారుజామున వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛను డబ్బులు అందిస్తున్నారన్నారు. గిరిజనులకు పోడు పట్టాలతో పాటు రైతుభరోసా వర్తింప చేయడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో అమలు జరుగుతున్నన్ని సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. ఈ సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బావుజీనాయుడు, ఎంపీపీ శెట్టి శ్యామల, జడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, పార్టీ కన్వీనర్ డి.జనార్దనరావు, సీనియర్ నాయకుడు శెట్టి మధుసూదనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్ బాబు, సర్పంచ్ శ్రీరామ్‌విజయ్, ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు, ఎంఈఓ జామి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పాలకొండ: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. మోటార్ హెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.వేణుగోపాల్, సహాయ మోటార్ హెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌లో సాగు వివరాల నమోదు



నులకజోడులో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ సింహాచలం

భామిని: రైతులు రబీలో సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవడంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్ను సింహాచలం సూచించారు. మండలంలోని నులకజోడు, వడ్డంగి, లోహరిజోల గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వ గిట్టుబాటు ధర లభించడంతో పాటు సులభంగా పంట విక్రయించుకునేందుకు ఈ-క్రాప్‌లో తప్పని సరిగా నమోదు చేయించుకోవాలన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని

- డ్వామా పీడీ రామచంద్రరావు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

వీరఘట్టం: జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారుడికి ఉపాధిహామీ పథకంలో పని కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ రామచంద్రరావు అన్నారు. మండలంలోని కంబర గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నాగావళి ఎడమ కాలువ 4వ బ్రాంచ్ నుంచి కంబర వరకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలువ గట్టును బాగు చేసేందుకు రూ.3.11 లక్షలతో ఎస్టిమేషన్ వేసినట్లు చెప్పారు. మంగళవారం 166 మంది వేతనదారులు పనికి వచ్చినట్లు ఏపీఓ జి.సత్యంనాయుడు తెలిపారు.

గడ్డికుప్పలు దగ్ధం

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరులో మంగళవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి ధనుంజయనాయుడుకు చెందిన నాలుగు గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందించగా వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికే గడ్డికుప్పలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల పరిశీలన



గరుగుబిల్లి జెడ్పీ ఉన్నతపాఠశాలను పరిశీలిస్తున్న పీఎంశ్రీ బృందం

గరుగుబిల్లి: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రేసింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి ఎంపికైన పాఠశాలలను పీఎం స్టేట్ టీమ్ సభ్యులు మంగళవారం పరిశీలించారు. లఖనాపురం, నాగూరు, గరుగుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, పెద్దూరు, సన్యాసిరాజుపేట ప్రాథమికోన్నత పాఠశాలల్లో పీఎంశ్రీ అమలుపై ఆరా తీశారు. తోటల పెంపకం, ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు, ప్లాస్టిక్ నిర్మూలన, విద్యలో గుణాత్మకమైన మార్పులపై శిక్షణ ఇవ్వడం, విద్యా హక్కుల చట్టం అమలు, సైన్స్‌ల్యాబ్‌ల నిర్వహణ, గ్రంథాలయాల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని కమిటీ సభ్యులు చైతన్య, ఆర్.విజయకుమారి, ఎం.భారతి, బి.సతీష్‌కుమార్ తెలిపారు. వారి వెంట ఎంఈఓ నగిరెడ్డి నాగభూషణరావు, హెచ్ఎం ఎస్.ఎల్ పాత్రుడు, సీఆర్పీ బోను రామకృష్ణ ఉన్నారు.

పకడ్బందీగా చేదోడు వెరిఫికేషన్



లబ్ధిదారుల వివరాలు వెరిఫై చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ నందిని, గ్రామ వలంటీర్లు

సీతంపేట: జగనన్న చేదోడు పథకం కింద ప్రభుత్వం టైలర్లు, రజకులు, నాయీబ్రాహ్మణులకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. మరికొద్ది రోజుల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేయనుంది. సీతంపేట సచివాలయం–1,2 పరిధిలో మొత్తం 34 మందికి ఈ పథకం వర్తించనుండడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ నందినితో పాటు గ్రామ వలంటీర్లు మంగళవారం లబ్ధిదారుల వివరాలు పునఃపరిశీలించి వారి వేలి ముద్రలు తీసుకున్నారు.

సమగ్ర సస్యరక్షణ విధానాలపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సురేష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: రైతులకు సమగ్ర సస్యరక్షణ విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ శాస్త్రవేత్తలు తోడ్పాటునందించాలని చింతపల్లి ఆర్ఏఆర్ఎస్ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం.సురేష్ కుమార్ అన్నారు. రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 39వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజన రైతులకు సేంద్రియ వ్యవసాయ విధానాలపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ విశాలక్ష్మి, డాక్టర్ ఏఆర్ రెడ్డి తదితరులు ఈ ప్రాంతంలో అగ్రి టూరిజం, పూల సాగు, తదితర అంశాలను వివరించడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



సీతంపేట: స్మైల్ ఆకృతిలో మానవహారంగా ఏర్పడిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

పాలకొండ రూరల్: బాలికల సంరక్షణ బాధ్యత అందరిదని, పాఠశాల స్థాయి నుంచి విద్యార్థినులు సమాజంపై అవగాహన పెంచుకోవాలని ఏపీ ప్రొ చైల్డ్ గ్రూప్ రీజనల్ కన్వీనర్, జనచేతన స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బగాది శశిభూషణ చౌదరి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సి చర్యలు, బాలికల సంరక్షణ కోసం తీసుకువచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రేణుకాదేవి, ఉపాధ్యాయులు వి.భాస్కరరావు, ఎం.లత, పి.కామేశ్వరి, రత్నం, జనచేతన కోఆర్డినేటర్ ఎం.సరస్వతి పాల్గొన్నారు.

- వీరఘట్టం: మండలంలోని రేగులపాడు వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎస్ఓ సీహెచ్ రోహిణి ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులు ఝాన్సీ లక్ష్మీభాయ్, సరోజినీ నాయుడు, మదర్ థెరిసా తదితర నారీమణుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

- భామిని: మండలంలో కోసలి సచివాలయం, భామిని కేజీబీవీలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, కార్యదర్శి ఎం.మహేంద్రకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులు మాక్ పంచాయతీ సమావేశం నిర్వహించారు. భామిని కేజీబీవీలో ఎస్ఓ బి.శారధ ఆధ్వర్యంలో విద్యార్థినులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

- సీతంపేట: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతంపేట బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు చిరునవ్వు ఎమోజీ ఆకృతిలో మానవహారం ఏర్పాటు చేశారు. హెచ్ఎం లిల్లీరాణి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, ఉపాధ్యాయులు బాలికల దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థినులకు వివరించారు.



వీరఘట్టం: వీర నారీమణుల వేషధారణలో కేజీబీవీ విద్యార్థినులు, సిబ్బంది



భామిని: మాక్ పంచాయతీలో వినతులు స్వీకరిస్తున్న సర్పంచ్ మజ్జి మేఘన



పాలకొండ రూరల్: క్రాఫ్ వాల్‌పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలి

- డీపీఆర్ఈఓ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ



మాట్లాడుతున్న డీపీఆర్ఈఓ ఎంవీఆర్ కృష్ణాజీ

గుమ్మలక్ష్మీపురం: 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం (జీజీఎంపీ) నిధులతో గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపిక చేసిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా పంచాయతీ సర్పంచ్‌లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఈ (డీపీఆర్ఈఓ) డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజీ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధికతో కలిసి సర్పంచ్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 15 మండలాల్లో జీజీఎంపీ కార్యక్రమం పూర్తయిన గ్రామ సచివాలయాల్లో 789 పనులు చేపట్టేందుకు గాను రూ.18.71 కోట్లకు పరిపాలనా ఆమోదం వచ్చిందని, ఈ నిధుల్లో రూ.13.80 కోట్లు పనులు చేపట్టే గుత్తేదారులకు చెల్లించేందుకు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. బిల్లుల విషయంలో అపోహలు వీడాలని, పనులు చేపట్టిన తక్షణమే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈ కింద 41 రహదారుల అభివృద్ధికి రూ.181 కోట్లు మంజూరుకాగా, ఇప్పటి వరకు 16 పనులు పూర్తయ్యాయని, 11 పనులు వివిధ దశల్లో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో పీఆర్ ఎంఈఓ మురళీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రవీణ్ ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: పాలకొండ మండలం డోలమడ పంచాయతీ వంతవాడ గ్రామానికి చెందిన మండంగి సత్యవతికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3లక్షల చెక్కును ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వండవ క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. గతేడాది మార్చిలో ఆమె కుమారుడు ప్రవీణ్‌కుమార్ విద్యుదాఘాతంతో మృతిచెందాడు. కుటుంబం జీవనాధారం కోల్పోవడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి ఎమ్మెల్యే దరఖాస్తు చేయించారు. మంజూరైన చెక్కును సర్పంచ్ బిడ్డిక నాగమ్మ, వెంకయ్య సమక్షంలో బాధితకుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. 2019 నుంచి ఇప్పటి వరకు పాలకొండ నియోజకవర్గంలోని 150 మంది బాధితులకు సీఎం సహాయనిధి నుంచి రూ.15 కోట్ల వరకు అందజేసినట్టు ఎమ్మెల్యే కళావతి వివరించారు.

విద్యతోనే సమాజం అభివృద్ధి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న గౌరునాయుడు

గుమ్మలక్ష్మీపురం: నవసమాజ నిర్మాణం విద్యావంతులతోనే సాధ్యమని, ప్రతీ విద్యార్థి చదువులో ఉన్నతంగా రాణించాలని జనవిజ్ఞాన వేదిక పార్వతీపురం మన్యం జిల్లా గౌరవ అధ్యక్షుడు గంటేడ గౌరునాయుడు అన్నారు. మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యతోనే జీవన స్థితిగతులు, ఆర్థిక పరిస్థితి, మాటతీరు, నడవడిక, వేషధారణ మారుతుందని, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక నేషనల్ కమిటీ అడ్వైజర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, పీఆర్ డీఈఈ ఆర్.రత్నకుమార్, ప్రిన్సిపాల్ ఎస్.పెంటన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందుకున్న వృద్ధులతో దోస్త్ మేరా దోస్త్ సంఘం ప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన 'దోస్త్ మేరా దోస్త్' సంఘం సభ్యులు మంగళవారం పలువురు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు పాలక ప్రేమానంద్, గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రస్తుతం చలి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వృద్ధులు చలిగాలులకు ఇబ్బంది పడకుండా దుప్పట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, భవిష్యత్‌లో వాటిని విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమం సంఘం సభ్యులు మద్ది దొరబాబు, బోటు లక్ష్మీనారాయణ, మజ్జి ప్రసాద్, కొణిస సూర్యం, ఎద్దు మురళి, వర్తక సంఘం అధ్యక్షుడు విష్ణు, వైస్ సర్పంచ్ కిషోర్ పాల్గొన్నారు.

రుణాల రికవరీపై దృష్టి



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ నారాయణరావు

వీరఘట్టం: డ్వాక్రా సంఘాలకు మంజూరు చేసిన రుణాలకు సంబంధించి మొండిబకాయిలను సత్వరమే వసూలు చేయాలని వెలుగు ఏపీడీ బి.నారాయణరావు సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీఎఫ్, కార్యాలయ సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా పేరుకుపోయిన బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రుణాలు తీసుకున్నవారితో మాట్లాడి చెల్లించేలా అవగాహన కల్పించాలని సీఎఫ్‌లకు సూచించారు. రేగులపాడులో స్త్రీనిధి క్రింద తీసుకున్న రుణంలో రూ.3.59 లక్షలు చెల్లించాల్సి ఉందని, దశుమంతపురంలో రూ.2.15 లక్షల బకాయిలు చొప్పున మండల వ్యాప్తంగా రూ.39 లక్షల వరకు బకాయి ఉన్నట్లు గుర్తించారు. సమావేశంలో ఏపీఎం జి.శివున్నాయుడు, స్త్రీనిధి మేనేజరు వి.లక్షణరావు తదితరులు ఉన్నారు.

నిరంతర పర్యవేక్షణ అవసరం



తుమరాడ సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయి అభివృద్ధిపై సచివాలయాల సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేపడుతుండాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని కొండాపురం, తుమరాడ గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడి సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. పీఎంజేఏవై సర్వే సక్రమంగా పూర్తిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఉపాధిహామీ పనుల పురోగతిపై సమీక్ష చేపట్టారు. వేతనదారులకు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలని, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు.

ఆర్‌బీకేలో విజిలెన్స్ తనిఖీలు



విక్రంపురం ఆర్‌బీకేలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ సీఐ సింహాచలం

కొమరాడ: మండలంలోని పరుశురాంపురం, విక్రంపురం ఆర్‌బీకేలను విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం మంగళవారం తనిఖీలు చేశారు. స్థానిక రైతులతో మాట్లాడి ఆర్‌బీకే సేవలు, ధాన్యం సేకరణ తీరుపై ఆరా తీశారు. నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఏఓ పి.శంకరరావు ఉన్నారు.

అటవీహక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న చిరంజీవిరావు

భామిని: మండలంలోని బొడ్డగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అటవీహక్కు చట్టం –2016పై గిరిజనులకు మంగళవారం అవగాహన కల్పించారు. బొడ్డగూడ, మణిగ పంచాయతీల పరిధిలోని 18 గిరిజన గూడల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. అటవీహక్కు చట్టంలోని హేబిటేట్ రైట్స్, రికార్డ్స్ ఆఫ్ రైట్స్ ప్రకారం అటవీ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చుకునే హక్కు, మౌలిక సదుపాయాలు పొందే హక్కు, అటవీ ఉత్పత్తుల ఫలసాయంపై హక్కు, మరణించిన వ్యక్తులు వారి కుటుంబ సభ్యులకు వారసత్వపు పట్టా పొందే హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మణిగ, బొడ్డగూడ వైఎస్సార్‌సీపీ నాయకులు కొండగొర్రి చంటి, బిడ్డిక అనంతరావు, వెలుగు అసోసియేషన్ ఏసీఓ చిరంజీవిరావు, గోపాల్, భామిని ఆర్‌బీకే ఏఏ ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.